

# సూర్యదేవర రామ్ మోహన రావు

**THE NUMBER ONE BEST SELLING AUTHOR**



# నాదైన ప్రపంచం

# నాదైన ప్రపంచం

ప్రతి మనిషి జీవితంలోన మలుపు అనదగ్గ సంఘటనలు ఏవో జరుగుతూనే వుంటాయి.

ఆ సంఘటన దగ్గర మనం ఎంత విజ్ఞతతో ప్రవర్తిస్తామన్న దానిమీదే మనం  సాధించే జయాప జయాలు ఆదారపడి వుంటాయి.

ఆ మలుపు దగ్గర తారసపడే వ్యక్తులు, జీవితాంతం మిత్రులుగా మారొచ్చు... శత్రువులుగా మారొచ్చు.

ఆ మలుపే మనల్నిఉన్నత శిఖరాలమీద నిలబెట్టొచ్చు, అథః పాతాళానికి తొక్కెయ్యవచ్చు.

జీవితం ఒక గేమ్...

ఎదుటి వాడికి ఛాన్సివ్వడం మానవత్వం అనుకుంటే ఓటమిని నువ్వు ఆహ్వానించుచు.

కానీ ఓడి గెలుస్తాను.

జీవితం ఒక గేమ్.

ఎదుటి వాడిని తొక్కయినా గెలవాలీ అని అనుకుంటే గెలుపు నీ దగ్గరకి రావచ్చు.

కానీ గెలిచీ ఓడుతావు.

గెలుపోటముల మధ్యవున్న అతి సూక్ష్మమైన బంధాన్ని అర్ధం చేసుకోగలిగితే.....

నువ్వు గెలవడం కోసం ఆడవు.

ఓడితే కుంగిపోవు.

ఆడటంలోని ఆనందాన్ని అనుభవిస్తావు.

జీవించడంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తావు.

ఇదే క్రీడాస్ఫూర్తి.

ఇదే జీవితానికి స్ఫూర్తి.....

* * * * *

హైదరాబాద్....

ఎల్బీ స్టేడియం.

సాయంత్రం నాలుగు గంటలు.

స్టేట్ లెవల్ వాలీబాల్ క్రీడలు జరుగుతున్నాయి.

అండర్స్-16 బాలికల వాలీబాల్ గేమ్ ఫైనల్ ఆరోజు.

లీగ్ మ్యాచ్‌లన్నింటిలో అరివీర భయంకరంగా ప్రత్యర్ధులను మట్టికరిపించి హైద్రాబాద్ బాలికల జట్టు, కృష్ణాజిల్లా బాలికల జట్టు ఫైనల్ చేరుకున్నాయి.

క్రీడలంటే ఆసక్తివున్న ప్రేక్షకులు ఐదు వేలమంది వరకు వచ్చారు.

ఆ ఫైనల్‌కు ఆ ప్రేక్షకుల సంఖ్య తక్కువేమీ కాదు.

అందరూ లోకల్ పీపుల్ కాబట్టి సహజంగానే హైదరాబాద్ జట్టుకి సపోర్టు ఎక్కువగా వుంది.

మ్యాచ్ ప్రారంభమైంది. ఇరుజట్ల బలాబలాలు సమానంగా వుండటంతో ఆట పోటాపోటీగా సాగుతోంది. ప్రేక్షకులలోవున్న యువకులంతా విజిల్స్, కేకలతో గోలచేస్తున్నారు.

కాని వాళ్ళ మధ్యేవున్న ఇరవైరెండేళ్ళ యువకుడు ఆటని తదేకంగా గమనిస్తున్నాడు. ఆటలో పూర్తిగా లీనమవడంతో ఏ బాల్‌ని కొట్టాలో ప్లేయర్స్‌కన్నా ముందు అతని మైండ్ డిసైడ్ చేస్తోంది.

వాళ్ళు శరీరాలతో ఆడుతున్నారు.

అతను మెదడుతో ఆడుతున్నాడు.

ఆడుతున్న వాళ్ళలో హైదరాబాద్ జట్టులోవున్న ఒక పొడవాటి అమ్మాయి ఆట అతన్ని ఆకర్షించింది.

పదిహేనేళ్ళకే ఐదడుగుల ఆరంగుళాల పొడవుతో, పొందికైన శరీరంతో...

క్రీడాకారిణి అన్న పదానికి నిర్వచనంలా వుంది.

కృష్ణాజిల్లా జట్టులో బాలికలందరూ ప్రతిభావంతంగా ఆడుతున్నారు.

కాని హైదరాబాద్ జట్టులో ఇద్దరమ్మాయిలు వీక్‌గా వున్నారు.

మిగతావాళ్ళు వాళ్ళని కవర్ చేయడానికి కష్టపడాల్సి వస్తోంది.

కోర్టులో ఉషారుగా కదులుతున్న ఆ అమ్మాయి వంకే తదేకంగా చూస్తున్నాడు ఆ యువకుడు.

స్కోరు 8.8 సమానంగా సాగుతోంది.

అందరిలో టెన్షన్ పెరుగుతోంది.

కృష్ణాజిల్లా జట్టుకి సపోర్టు తక్కువగా వున్నా, టీమ్ స్పిరిట్‌తో వాళ్ళను వాళ్ళే ఉషారుపరచుకుంటూ ఆడుతున్నారు.

స్వంత ప్రదేశంలో ఆడుతున్నామన్న ధీమా హైదరాబాద్ వాళ్ళది. వాళ్ళలో వున్న ఆత్మ విశ్వాసం మూలంగా టీమ్‌లోవున్న వీక్ పాయింట్స్‌ని కవర్ చేసుకుంటున్నారు.

కృష్ణాజట్టు కెప్టెన్ సర్వీస్‌కి రాగానే హైదరాబాద్ టీమ్‌కి దడ పట్టుకుంది.

ఝంఝా మారుతంలా దూసుకువచ్చే ఆ సర్వీస్‌ని ఎదుర్కోవడమే కష్టం. ఇక బ్రేక్ చేయడమంటే మాటలా?

ఫస్ట్ బాల్ రైట్ సైడ్ డిఫెన్స్ వైపు దూసుకెళ్ళింది.

కళ్ళముందు మెరుపులు మెరిసినట్లయ్యి, గుడ్డిగా గాలిలోకి చేతులు ఊపింది అక్కడ వున్న అమ్మాయి. సైడ్ లైన్‌కి రెండంగుళాల యివతల నేలను తాకి బయటకు వెళ్ళిపోయింది బంతి.

స్కోరు.... 9-8.

ఆ యువకుడు తననాకర్షించిన ఆ అమ్మాయి మూవ్‌మెంట్స్ పరిశీలి స్తున్నాడు. సెంటర్ ప్లేస్‌లో నిలబడింది ఆ అమ్మాయి.

ఈసారి బంతి తనకే గురిచేయబడుతుంది అన్న విషయానికి ఆమె మానసికంగా సంసిద్ధమయింది.

అతనికి ముచ్చటేసింది.

ఆటలో అదే ముఖ్యం.

ప్రత్యర్థి సైకాలజీని గమనించి అందుకు మనం సెకండ్స్‌లో ప్రిపేరవడం చాలా ముఖ్యం.

అనుకున్నట్లుగానే ప్రత్యర్థి జట్టు కెప్టెన్ చేసిన సర్వీస్ సెంటర్‌కిబూస్టర్‌కీ మధ్యలో నేలని ముద్దాడబోతోంది. బూస్టర్ చూస్తూ నిల్చుంది.

సెంటర్ ప్లేస్‌లోవున్న అమ్మాయి....ఆఖరి క్షణంలో రియాక్ట్ అయింది. పూర్తిగా నేలకి వాలిపోయి కుడి చేతిని ముందుకు చాపి, బంతికీ, నేలకీ అడ్డుగా పెట్టింది. ఆ క్షణంలో చెయ్యి నేలకి తాకకుండా జాగ్రత్త పడింది.

అంతే...బాల్ పైకిలేవడం, బూస్టర్ దాన్ని పొజిషన్‌లోకి తేవడం లెఫ్ట్ సైడ్ స్ట్రయికర్ దాన్ని స్మాష్ కొట్టడం వూహించని వేగంతో జరిగిపోయాయి.

సర్వీస్ బ్రేక్ అయింది.

కృష్ణా జట్టు కెప్టెన్ నమ్మలేకపోయింది.

సెంటర్ ప్లేస్‌వంక తీక్షణంగా చూసింది.

ప్రేక్షకులంతా గొల్లున అరుపులు, ఈలలు.

హైదరాబాద్ జట్టు సర్వీస్‌లో రెండు పాయింట్స్ వరసగా సాధించి....

10.9 ఆధిక్యంలోకి దూసుకెళ్ళింది. తర్వాత వాళ్ళ సర్వీస్ కూడా బ్రేకయింది.

అందరిలోనూ తీవ్రమయిన ఉత్కంఠ నెలకొంది.

అందరిలోనూ తీవ్రమయిన ఉత్కంఠ నెలకొంది.

ఈ మధ్యకాలంలో ఇంత టెన్షన్ గేమ్ చూడలేదని వాలీబాల్ క్రీడాకారులంతా అనుకుంటున్నారు.

అప్పుడు వరుసగా రెండు పాయింట్లు సాధించిన వాళ్ళని విజయం వరిస్తుంది.

ఆ పాయింట్ కృష్ణా వాళ్ళు సాధిస్తే వాళ్ళదే గేమ్.

హైదరాబాద్ వాళ్ళు సాధిస్తే మళ్ళీ 14 14 అవుతుంది.

గేమ్ పాయింట్ దగ్గర సర్వీస్ కృష్ణాజిల్లాకి వచ్చింది.

అదీ కెప్టెన్ సర్వీస్.

అడే వాళ్ళు కూడా టెన్షన్‌గా వున్నారనడానికి చిహ్నంగా ఆ బాల్‌ని సర్వీస్ చేసేముందు రెండు నిమిషాలు ఇరుజట్లూ టైమ్ ఔట్ కోరి, గ్రౌండ్ బయట డిస్కస్ చేసుకున్నారు.

ఆ యువకుడి ధ్యాస అంతా ఆ అమ్మాయిమీదే. అందరూ ఎవరి ప్లేస్‌లో వాళ్ళు నిల్చున్నారు. ఆ అమ్మాయి లెఫ్ట్‌సైడ్ స్ట్రైకర్‌గా నిల్చుంది.

కృష్ణా కెప్టెన్ సర్వీస్ చేసింది. ఎప్పటిమాదిరిగా ఆ సర్వీస్ తుపాకి గుండులా దూసుకుంటూ సెంటర్‌కి వచ్చింది.

అయితే అది డైరెక్ట్‌గా చేతులమీదకి రావడంతో ఆ అమ్మాయి దాన్ని బూస్టర్‌వైపు పాస్ చేసింది.

ఇంకా తర్వాత కృష్ణా జట్టు ఆశలు వదిలేసుకుంది. గేమ్ మళ్ళీ ప్రొలాంగ్ చెయ్యబడుతుంది అనుకున్నారు.

బూస్టర్ దాని లెఫ్ట్‌సైడ్ స్పైకర్‌కి స్మాష్ కోసం పాస్ చేసింది... స్మాష్ కోసం చక్కటి పొజిషన్‌లో బాల్ పైకి లేచింది.

శరీరాన్ని తేలిక చేసుకుని

బంతిలా రివ్వున పైకెగిరి

ఉక్కుముక్కలా దృఢంగా ఉండే చేతితో

స్మాష్ కొట్టాల్సిన బంతి అది...

అదే జరిగిందనుకొన్నా రందరూ....

ఆ అమ్మాయీ తను కావలసినంతా పైకెగిరాననే అనుకుంది.

కానీ అనుకున్నంత ఎత్తుకి ఎగరలేకపోయింది. చెయ్యి మెల్లగా తాకింది. దాంతో వేగం తగ్గింది. బంతి మెల్లగా నెట్‌కి ఆరంగుళాల ఎత్తులో రెండు కోర్టులకి మధ్యన గాల్లోకి ఎగిరింది.

కృష్ణాజిల్లా బూస్టర్స్ చేతికి తగిలి బంతి నెట్ మీదుగా జారుతూ హైదరాబాద్ జట్టు కోర్టులో నేలకొరిగింది.

క్షణంపాటు ఏం జరిగిందో అర్థంకాలేదు. స్టేడియం అంతా నిశ్శబ్దమైపోయింది. అందులోంచి నిరుత్సాహపు నిట్టూర్పులు వినిపించాయి.

కృష్ణాజిల్లా జట్టు విజయం సాధించారు.

వాళ్ళంతా ఒకటే విజయాన్ని ఆస్వాదిస్తున్నారు.

పసితనం వదలని వారి మొహాల్లో ఆనందం ప్రస్ఫుటంగా తాండవిస్తోంది. చెమటతో నిండిన వారి శరీరాలు విజయం కోసం వారు పడిన తపనను తెలియజేస్తున్నాయి.

ఓడిన జట్టు మొహాలు ముకుళించుకుపోయాయి. జట్టులో మిగతా అందరూ లెఫ్ట్ స్పైకర్ వంక ఆరోపణగా చూస్తూ కోర్టు వదిలారు.

ఆ షాక్‌నుంచి ఇంకా తేరుకోలేకపోతోంది అమ్మాయి....అంత చక్కటి బంతి....ఎంత అనువుగా పొజిజన్‌లోకి వచ్చింది....? తనెందుకు స్మాష్‌గా మలచలేకపోయింది?!

అందరిలా ఎందుకు రివ్వున ఎగరలేకపోయింది?

ముందునుంచి అదే తన వీక్ పాయింట్!... ఆ వీక్ పాయింట్ ప్రత్యర్థికి మ్యాచ్ పాయింటయ్యింది.

అందరి చూపులనుంచి తప్పించుకుంటూ అక్కడినుంచి ఎక్కడికైనా పారిపోవాలని వుంది.

అపజయాన్ని.... ఓ మెట్టుగా భావించగలిగే ధైర్యం అలవడటానికి ఆమె వయసు ఎంతని?!

కళ్ళనుండి నీరు చెంపలమీదకి జారకుండా వుండటానికి, మనసుతో పోరాటం చేస్తోందామె.

స్టేడియంలో జనాలు చాలామంది తిరుగుముఖం పట్టారు. కొంతమంది గెలిచిన జట్టుకి అభినందనలు తెలుపుతున్నారు. చాలా తక్కువమంది ఓడిన జట్టుని కన్సోల్ చేస్తున్నారు.

ఆ అమ్మాయి....

అక్కడే....

ఆ కోర్టులోనే చిత్తరువులా నిలబడింది.

మాటిమాటికి కోర్టులోవున్న బంతివంక, చేతులవంక మార్చిమార్చి చూసుకుంటోంది.

ఎవరో చూసి రమ్మని పిలిచారు.

వెళ్ళలేదామె....

ఎవరూ ఆమెకోసం ఆగలేదు.

ఎవరిదోవన వారు నిష్క్రమిస్తున్నారు....

ఆసక్తిగా ఆమెవంకే చూస్తున్నాడు ఆ యువకుడు.

జనాలు పలచబడుతున్నారు....

మ్యాచ్ కోసం వచ్చిన వాళ్ళలో అందరూ వెళ్ళిపోయారు.

మిగతావాళ్ళు ఎవరి గేమ్ వాళ్ళు ప్రాక్టీస్ చేసుకుంటూ ఉండిపోయారు.

ఆ అమ్మాయి బంతి చేతిలోకి తీసుకుంది. పొజిషన్‌లోకి విసిరి....స్మాష్ కొట్టడానికి ఎగిరింది. బంతి వెళ్ళి నెట్‌కి కొట్టుకుంది. అంత వేగం రావటంలేదు.

నిరుత్సాహంగా బంతి నేలకేసి కొట్టి, కాసేపు ఆలోచిస్తూ వుంది. మళ్ళీ లేచి నిలబడింది.

అదే ప్రయత్నం.....

అదే ఫలితం....

ఆ యువకుడు నవ్వుకుంటూ ఆమె దగ్గరకు నడచి వచ్చాడు.

పొంగుతున్న దుఃఖప్రవాహంతో.....

కసిగా....

పట్టుదలగా....

తన బలహీనతను జయించడానికి ప్రయత్నిస్తున్న ఆ పసిమొగ్గని చూసి ఆనందపడ్డాడు.

అప్పటికే కనుచీకట్లు ముసురుకుంటున్నాయి.

అదేమీ గమనించే స్థితిలో లేదామె.

అతను దగ్గిరకు వచ్చి కోర్టు బయట నిలబడి....

"హలో....!" అన్నాడు.

చివ్వున తలతిప్పి చూసింది.

ఆరడుగుల పొడవున్న యువకుడు....

గడ్డం మాసిపోయి, పీక్కుపోయిన దవడలతో, ఒకప్పటి శారీరక దృఢత్వాన్ని తెలియజేసే బాడీ షేప్‌తో.... చూడగానే క్రీడాకారుడని తెలుస్తోంది.

ఏంటన్నట్లు చూసింది.

అతను కోర్టులోకి వచ్చాడు.

బంతివ్వమన్నట్లు చేయి చాపాడు.

మంత్రముగ్ధలా బంతిని అతనికి అందించింది.

బంతిని చేతిలోకి తీసుకుంటుంటే, అతని చేతివేళ్ళు కంపించాయి.

కొత్త వస్తువుని చూసినట్లు దాన్ని చూశాడు.

బంతిని నేలకేసి కొట్టాడు. మళ్ళీ అది చేతిలోకి రాలేదు. కిందే పడింది. వంగి చేతిలోకి తీసుకున్నాడు.

ఆ అమ్మాయికి చిరాకు వచ్చింది. బంతి సరిగ్గా చేత్తో పట్టుకోవడం రాని మనిషి....తనని ఇప్పుడు ఆట నేర్పించమంటాడేమో!

"ఏంటీ....గేమ్ నేర్పించాలా?" విసుగ్గా అడిగింది.

"ఊహూ!...."

"మరి?" ప్రశ్నార్థకంగా చూసింది.

"స్మాష్ కొట్టడానికి పైకెగిరినప్పుడు నువ్వు కాళ్ళు స్ట్రయిట్‌గా పెడుతున్నావు. అలాకాదు....ఎగిరే క్షణంలోనే కాళ్ళు వెనక్కి వంగాలి. అదే సమయంలో చేయి లేవాలి...." చెప్పాడు.

"ఓహో....థియరీనా వ్యంగ్యంగా అందామ్మాయి.

"ప్రాక్టికల్‌గా కూడా అదే కరెక్ట్ పొజిషన్...." నమ్మకంగా అన్నాడు.

"అక్కడ, ఇక్కడ విని అందరూ కబుర్లు బాగానే చెపుతారు....కాని ఆడటమే చాలా కష్టం" కోర్టు బయట వున్న కుర్చీలో కూర్చుంటూ అంది.

అతనొక్కసారి బాల్ వంక, నెట్‌వంక చూశాడు.

నెట్‌ని మరింత హైట్‌కి లేపాడు.

లెఫ్ట్‌సైడ్ స్ట్రైకర్ ప్లేస్‌లో నిల్చుని బంతి పట్టుకొని...

"కమాన్..." పిలిచాడు.

హేళనగా, నవ్వులాటలా భావిస్తూ వచ్చిందామ్మాయి. బూస్టర్‌గా నిల్చుంది.

చేతిలోని బంతిని ఆమెవైపు విసిరాడు. లెఫ్ట్‌సైడ్ స్పైకర్ వున్న వైపు బూస్టింగ్ చూసింది.

బంతి పొజిషన్ తెలిసింది.

ఇందాక అచ్చం బంతి అలాగే తన చేతికి అనువుగా వచ్చింది. అతని ముందు కూడా బంతి అలాగే లేచింది.

శరీరాన్ని తేలిక చేసుకొని...

బంతిలా రివ్వున పైకెగిరి....

కాళ్ళు కాస్త వెనక్కి వంచి....

ఉక్కుముక్కలా దృఢంగా వుండే చేతితో...

స్మాష్ కొట్టాడతను....

ఆమె విస్మయంగా చూస్తుండగానే బంతి ఆపోజిట్ కోర్టు బూస్టర్ ప్లేస్ మీదుగా శరవేగంతో వెళ్ళి రైట్ డిఫెన్స్ వెనకాల బ్యాక్ లైన్‌కి ఇవతల పడింది.

ఆ బంతి తాలూకు తీవ్రత ఎలాగుందంటే, అలా పడిన బంతి లేచి మళ్ళీ నేలని తాకింది. ముప్పై అడుగుల అవతలే! కళ్ళు మిరుమిట్లు గొలిపాయి ఆ అమ్మాయికి!

మార్వలెస్!!!....

ఆ బంతిని ఎదుర్కోవడం ఇంపాజిబుల్. ఏమనాలో తెలియక అచేతనంగా నిలబడిపోయింది.

అతను ఆ అమ్మాయిని మాటలతో ఎత్తిపొడవలేదు.

"కమాన్... ట్రైచెయ్యి...." చెప్పాడు.

అతను బూస్టర్‌గా. ఆమె స్పైకర్‌గా ప్రాక్టీస్ మొదలయింది....

మొట్టమొదట ఆమె పైకెగిరినపుడు ఉండాల్సిన పొజిషన్ నేర్పించాడు....

ఆ తర్వాత శక్తినంతా చేతిలోకి ఎలా తెచ్చుకోవాలి...టైమింగ్‌తో బంతిని స్మాష్‌గా ఎలా మలచాలీ చెప్పాడు...

ఒక గంట...

అంతే!...

నేర్పినవాడి గొప్పతనమో!.... నేర్చుకున్న అమ్మాయి గొప్పతనమో!...గంటలో ఆమె తన ఏకైక బలహీనతని అధిగమించింది.

ఈ ప్రపంచమే తన సొంతమయినట్లు ఆనందించింది....

పదిసార్లు కృతజ్ఞతలు తెలియజేసింది.

"మీపేరు....?" తను గుర్తుంచుకోదగ్గ వ్యక్తుల లిస్ట్‌లో మొదటిస్థానాన్ని అతనికి కేటాయిస్తూ అడిగింది.

"ప్రణీత్!...." చెప్పాడు.

ఆమె మెమరీలో నిక్షిప్తమయిపోయింది అతని పేరు....

అతను తన పేరు అడగకపోవడం చూసి...

"నా పేరు కీర్తన...." తనే చెప్పేసింది.

"ఆహా!...." తల పంకించాడు.

"ఈరోజు మీరు నేర్పిన దాంతో.... నేను అన్నీ నేర్చుకున్నట్లే. వాలీబాల్ ప్లేయర్‌గా నేనిపుడు అన్ని ప్లేసుల్లోనూ ఫిట్." సగర్వంగా అందా అమ్మాయి.

తల అడ్డంగా ఆడించాడు ప్రణీత్.

తెల్లబోయింది కీర్తన. "కాదా....? ఇందాక మీరు మ్యాచ్ చూసే ఉంటారు. నేను అన్ని ప్లేసుల్లోనూ వుండి పాయింట్స్ తెచ్చాను...."

ఉక్రోషంగా అంది.

"ఆ విషయానికి నేను అనడంలేదు..."

"మరి.....?"

"ఫిట్‌గా వుండాల్సింది ముందు ఇది...." పిడికిలితో హృదయం మీద కొట్టుకుంటూ అన్నాడు.

అర్థంకానట్లు చూసింది....

"నువ్వు ఎంత గొప్ప ప్లేయరైనా కావచ్చు. నీ గేమ్‌లో వీక్ పాయింట్స్ ఏమీ లేకపోయి వుండొచ్చు. కానీ నీ హృదయం వీకయితే నువ్వు అదఃతాళానికికుంగిపోతావు....." చెప్పాడు.

భయంగా వింది.... అతను అన్నది అర్థంకాలేదు.

హృదయం వీక్ అంటే!!....

"హార్ట్ ఎటాకా....?" అదే అడిగింది.

గలగలా నవ్వాడు....

"ఆ! ఆ!.... హార్ట్‌మీద లవ్ అటాక్!.... అందుకే గేమ్‌లో

ఫుల్‌గా ఫిట్ అయిన నేను, ఆ ఎటాక్‌తోనే నేషనల్ గేమ్స్‌లో ఛాన్స్

పోగొట్టుకున్నాను. అందుకే ముందు హృదయం ఫిట్‌గా వుండాలి....

చెపుతూనే నడుస్తూ వెళ్ళిపోయాడు.

'లవ్ ఫెయిల్ ఏమో!....' ఒక్క క్షణం బాధపడింది.

మళ్ళీ వెంటనే మర్చిపోయి బంతితో ఆట ప్రారంభించింది.

✧ ✧ ✧ ✧ ✧

చుట్టూ ఆవరించిన రాజప్రాసాదంలాంటి ఇల్లు....

అయితే అది రాజసంతో ఠీవిగా లేదు. చాలా పురాతనంగా వుంది.

రాజులూ పోయి, రాజ్యాలూ పోయి అలనాటి వారి వైభవాలను

తెలిపే చిహ్నాలు భారతదేశంలో అక్కడక్కడా మిగిలివున్నట్లే జమీందారుల సంపదలను, విలాసాలను తెలిపే కోటల్లాంటి ఇళ్ళూ వున్నాయి....

జమీలు పోయాక జమిందార్లు ప్రభుత్వం ఇచ్చే భరణాలతో చాలా కాలం విలాసంగానే గడిపారు....

తర్వాత ఇందిరాగాంధీ హయాంలో రాజభరణాలతోపాటు ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల భరణాలూ రద్దుచెయ్యబడ్డాయి.

ఉన్న ఆస్థుల్ని కరిగించుకుంటూ ఎప్పటికి అప్పటి దర్జాను, హోదాను నిలబెట్టుకోవాలనే తాపత్రయంతో సర్వం కోల్పోవడానికి సిద్దంగా వున్నవాళ్ళు ఎందరో....!

అలాంటివారిలో రావు బహద్దూరు జగపతిరాయభూపతి ఒకడు....

తమ ఆస్థులన్నింటినీ ప్రభుత్వం జాతీయం చేసుకున్నపుడు అతను టీనేజ్‌లో వున్నాడు.

తండ్రే అన్ని వ్యవహారాలూ చూసుకోవడంతో దాని తాలూకు తీవ్రత ఏంటో అతనికి తెలియలేదు.

జీవితం అంతా పంచరంగుల కలగా వుండేది. చదువు అబ్బలేదు.

ఎప్పుడూ గుర్రపు బగ్గీలో షికారు వెళ్ళడం, మిగతా వారందరి ముందూ దర్జా చూపించడానికి ప్రయత్నించడం తప్ప అతనికి ఏమీ తెలియదు.

జరిగిన నష్టం.... రాబోయే కాలంలో గడపబోయే జీవితం పదేపదే మనసుమీద దాడిచేస్తుండటంతో హఠాత్తుగా తండ్రి హార్ట్‌ఎటాక్‌తో చనిపోయాడు.

ఇరవై ఏళ్ళకే బాధ్యతలు నెత్తినపడ్డాయి భూపతికి.

అపుడే తెల్లబోయి జీవితంవంక చిత్రంగా చూడడం ప్రారంభించాడు. ఇక ఈ జీవితంలో సర్దుబాట్లు, పొదుపు, కష్టపడటంలాంటివి తప్ప ఇంకేమీ కన్పించలేదు.

తల్లి పెద్దగా గడుసైంది కాదు. అన్నీ తనమీద పడిపోవడంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు మనిషి.

ఇరవై ఐదోయేట పెళ్ళయింది. అయిదేళ్ళలో ఇద్దరు పిల్లల్ని కని కన్నుమూసింది భార్య. జీవితం మరింత దుర్భరంగా మారింది.

ఒకప్పటి తమ విలాసాసలూ ఇప్పటికీ కొనసాగించటం వైట్ ఎలిఫెంట్‌లా మారింది.

అంతమంది నౌకర్లూ చాకర్లని పోషించడం అతికష్టం అయిపోయింది. మెల్లగా ఒక్కొక్కరినీ తీసివేయడం ప్రారంభించాడు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Nadaina+Prapancham**

* * *